


కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

# భవిష్యత్ బీఆర్ఎస్‌దే..

అడ్డగోలు హామీలతో ప్రజలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్

పాలనలో హస్తం పార్టీ పూర్తి వైఫల్యం

*'భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదే.. రానున్న రోజుల్లో మనమే అధికారంలోకి వస్తాం. అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసింది. పాలనలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైంది. ఇచ్చిన హామీల్లో ఒక్క శాతం కూడా పూర్తి చేయలే. 10 శాతం హామీలే ఇచ్చి జనం అడగని 90 శాతం పథకాలు ప్రజలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌ది. మనకన్నా మంచిగ చేస్తామని ఊదరగొడితే ప్రజలు నిజమేనని గెలిపించారు. వారు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు. కష్టపడి పనిచేస్తే అన్ని ఎన్నికల్లోనూ విజయాలు మనవే' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఇంట్లో శనివారం పాలకుర్తి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాసరెడ్డి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీని వీడి తనతో పాటు 300 మంది కార్యకర్తలతో బీఆర్ఎస్‌లో చేరారు.*

*- దేవరుప్పుల, నవంబర్ 9*

## రానున్న రోజుల్లో మనదే అధికారం

- ఏం కోల్పోయామో ప్రజలకు అర్థమైంది
- కష్టపడి పనిచేస్తే అన్ని విజయాలు మనవే
- పాలకుర్తి నియోజవర్గ పార్టీ శ్రేణులతో కేసీఆర్
- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాసరెడ్డి గులాబీ పార్టీలో చేరిక

అడ్డగోలు హామీలతో మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ తీరుపై ప్రజలు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారని, రానున్న రోజులు మనవే, మళ్లీ మన పార్టీనే అధికారంలోకి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లిలో కేసీఆర్‌ను శనివారం పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు కలవడంతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాసరెడ్డి 300 మంది కార్యకర్తలతో గులాబీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారితో మాట్లాడుతూ జనం కాంగ్రెస్ మాయమాటలకు మోసపోయామని తెలుసుకుని పశ్చాత్తాపం చెందుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో ప్రజలకేం తక్కువ చేయలేదని, కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓట్లు వేశారని, అవి చేతల రూపం దాల్చవనే విషయం ప్రజలకు బోధపడిందన్నారు. ఇక ఏ ఎన్నికలు ఇచ్చినా జనం బీఆర్ఎస్ వెంటే ఉంటారనేది అక్షర సత్యమన్నారు. మనం కష్టపడి పని చేస్తే స్థానిక సంస్థల మొదలు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు అన్ని విజయాలు మనవేనని కేసీఆర్ అన్నారు. ప్రభుత్వం అంటే అందరినీ కాపాడాలని, నిర్మాణం చేయాలని, పది మందికి లాభం జరగాలని, ముఖ్యంగా రైతులు, సామాన్యులకు సంక్షేమ పథకాలు అందాలన్నారు. ఇదంతా పక్కనబెట్టి ప్రతిపక్ష పార్టీ వాళ్లను లోపల వేస్తామని ఊదరగొడుతున్నారని, ఇదేనా వాళ్లు చేసే అభివృద్ధి అన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఇచ్చిన హామీల్లో ఒక్క శాతం పూర్తి చేయలేదని, అదే మన ప్రభుత్వం జనం అడగని పథకాలు ప్రజలకు అందించామన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, కేవలం అధికారం చేజిక్కించుకునేందుకే అనేక అలవికాని హామీలు ఇవ్వడంతో ప్రజలు విశ్వసించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా మునిగిపోయిందేమీ లేదని, ప్రజలు పునరాలోచిస్తున్నారన్నారు. రానున్నది మనపాలనే అని, ప్రజలకు రెట్టింపు అభివృద్ధి, సంక్షేమాలు అందించి బీఆర్ఎస్ మార్కు పాలన చూపుదామన్నారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టినా భయపడాల్సిన పనిలేదని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. లీగల్‌గా పోరాడుదామని పేర్కొన్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ తన స్వచ్ఛంద సంస్థతో అనేక మందికి చేయూతనిచ్చిన శ్రీనివాసరెడ్డి చేరిక పాలకుర్తిలో బీఆర్ఎస్‌కు కొండంత బలాన్ని ఇచ్చిందన్నారు. ఆపద వస్తే నేనున్నానంటూ రెక్కలు కట్టుకుని వాలే శ్రీనివాసరెడ్డి లాంటి వారు పార్టీకి బలం చేకూర్చుతారని పేర్కొన్నారు. ముఖ్యంగా రాయపర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయినట్టేనన్నారు.



పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## పాలన చేతకాని దద్దమ్మలు

- హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్
- బుల్డోజర్లతో తొక్కిస్తామనడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే
- బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

హనుమకొండ, నవంబర్ 9 : పాలన చేతకాని దద్దమ్మలు కాంగ్రెస్ నాయకులని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకుల దిగజారుడు మాటలపై శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి కాళోజీ సెంటర్ వద్దకు వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకొనే క్రమంలో తోపులాట జరిగింది. అనంతరం దాస్యం మాట్లాడుతూ హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆరోపించారు. పాలన చేతకాక ప్రతిపక్ష నాయకులపై పాపపు మాటలు మాట్లాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు బ్రాండ్ ఇమేజ్ బీఆర్ఎస్ తెస్తే బ్యాడ్ ఇమేజ్‌ను కాంగ్రెస్ తీసుకొస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, హామీలను అడుగుతుంటే అక్కసుతో కేసుల పాలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆకాశంపై ఉమ్మి వేయడమేనని ఆయన పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, పేదల ఇండ్ల కూల్చివేతలకు మాత్రమే వ్యతిరేకమని వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. మూసీ నది సుందరీకరణ పేరుతో పెద్ద మొత్తంలో అవినీతి జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు అడ్డుకుంటే వారిపై బుల్డోజర్లు ఎక్కిస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికీ రైతులకు రైతు బంధు లేదని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. 75 ఏండ్లలో దాదాపు 50 ఏండ్లు పాలించింది కాంగ్రెస్‌పార్టే కదా.. మరి మూసీ కలుషితం కావడానికి కారణం కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. మురుగు నీటిని శుద్ధి చేయడంతో పాటు కాంగ్రెస్ నాయకుల నోళ్లల్లో ఉన్న మురికిని ముందుగా శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు.



బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట

కేసీఆర్‌పై చేసిన దిగజారుడు మాటలపై సుబేదారి పోలీస్ స్టేషన్‌లో వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కూడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్, కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్‌రావు, బొండు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, విద్యార్థి సంఘం నాయకుడు రాకేశ్ యాదవ్, రఘు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన బిడ్డకు బీఆర్ఎస్ అండ

- కేసీఆర్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందజేత
- ప్రభుత్వం న్యాయం చేయకపోతే శ్రీను ఇంటికి వస్తానని హామీ



లకావత్ శ్రీను కుటుంబసభ్యులకు రూ.3లక్షల చెక్కును అందజేస్తున్న కేసీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, నవంబర్ 9: ప్రభుత్వ వైఫల్యం.. పోలీసుల నిర్లక్ష్యం.. కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో పోలీస్‌స్టేషన్ సాక్షిగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న గిరిజన బిడ్డ లకావత్ శ్రీను కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో శ్రీను కుటుంబసభ్యులకు ఎర్రవల్లిలోని తన ఇంటిలో కేసీఆర్ రూ.3 లక్షల చెక్కును పార్టీ పరంగా అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగడం లేదని గిరిజన బిడ్డ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోవడమంటే అది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయకపోతే జనవరిలో శ్రీను ఇంటికి వస్తానని హామీ ఇచ్చారు. ఆయన కుటుంబాన్ని పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కేసీఆర్ సూచించారు. అధైర్యపడకండి.. భవిష్యత్ బీఆర్‌దేనని పార్టీ కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అరెస్టులు, ప్రభుత్వ ప్రతీకార చర్యలకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడొద్దన్నారు. కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ మోహన్‌గాంధీ నాయక్, మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, గిరిజన సంఘాల నాయకులు జర్పుల బాలునాయక్, ధరావత్ రాంసింగ్ నాయక్, శ్రీను కుటుంబ సభ్యులు లకావత్ సోమన్న, లకావత్ యాకూబ్ పాల్గొన్నారు.



విద్యార్థులు తయారుచేసిన ఆధునిక బైక్

## ఇన్నోవేషన్స్.. అదుర్స్..

పలు ఈవెంట్లతో ఆకట్టుకున్న విద్యార్థులు

నిట్ ఉత్సాహంగా టెక్నోజియాన్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 9 : వరంగల్ నిట్ క్యాంపస్ కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారింది. టెక్నోజియాన్‌లో సరికొత్త ఇన్నోవేషన్స్ ఆవిష్కృతమవుతున్నాయి. దేశంలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల నుంచి సుమారు 7వేల మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 50కిపైగా ఈవెంట్లను ప్రదర్శించారు. క్రియేటివ్ రోబోటిక్స్ స్కిల్‌షాప్ నుంచి చిన్నారులు రుద్రాక్షిత ఏటీఎం మిషన్ రూపొందించగా చెరువులను శుద్ధిచేసే పరికరాన్ని గొల్లపల్లి మన్విత రూపొందించింది. నిట్ విద్యార్థులు కొండలు, పర్వతాలు ఎక్కే సరికొత్త బైక్‌ను రూపొందించారు. 25 మంది విద్యార్థులు 6-7 నెలలు కష్టపడి రూ.4లక్షల వ్యయంతో ఫార్ములా కార్ తయారు చేసి అబ్బురపరిచారు. ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదివితే సాధించలేనిది ఏమీలేదని మోటివేషన్ స్పీకర్, ఫౌండర్ మ్యాథ్స్ స్కేర్ డాక్టర్ గజేంద్ర పురోహిత్ అన్నారు. 'భవిష్యత్తును ఉద్దేశ్యంతో నడిపించండి' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 'నమస్తే వరంగల్' అందరూ బాగున్నారా అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనూజైన్ విద్యార్థులను ఉత్సాహపరిచారు. అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. కాగా, టెక్నోజియాన్‌లో విద్యార్థులు సరికొత్త పరికరాలను రూపొందించారు. ఆడవారికి వచ్చే పీరియడ్స్ నొప్పులు మగవారికి వస్తే ఎలా భరిస్తారనే ఆలోచనతో ఫీల్ ది పెయిన్ అనే పరికరాన్ని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించారు. ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్-డీఎన్ఏ, వేలిముద్ర, ఇతర ఫోరెన్సిక్ సాంకేతికతలపై వర్క్‌షాప్ నిర్వహించారు. క్యాంపస్ స్టేడియంలో రోబోటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రోన్ల వేగం అందరినీ అబ్బురపరిచింది.



నిట్‌లో రోబోటిక్స్ ప్రదర్శనలు



నిట్‌లో ఇంజినీరింగ్ విద్యార్థుల సందడి

## నేడు హనుమకొండకు కేటీఆర్



హనుమకొండ, నవంబర్ 9 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు హనుమకొండకు రానున్నారు. రాంపూర్ సమీపంలో హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు కుమార్తె వివాహానికి హాజరుకానున్నారు. అక్కడి నుంచి హనుమకొండకు బయలుదేరుతారు. ఈ క్రమంలో కడిపికొండ బ్రిడ్జి వద్ద వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకొని 3 గంటలకు విలేకరుల సమావేశంలో మాట్లాడుతారు.

## గడపగడపకూ న్యాయ సేవలందించాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్
- ఘనంగా న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్ పాల్

నయీంనగర్, నవంబర్ 9 : గడపగడపకూ న్యాయ సేవలందించేలా న్యాయ సేవాధికార సంస్థలు చూడాలని హైకోర్టు న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజయ్‌పాల్ అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక హక్కులు, విధుల గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉచిత న్యాయ సహాయం అనేది స్వాతంత్ర్యం రాక ముందు నుంచే ఉందని అన్నారు. అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాలు గ్రామాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని, వారిని వినియోగించుకోవాలని అన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కమ్యూనిటీ మీడియేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, అది సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజల మధ్య వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో న్యాయ సేవా సంస్థలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. పూర్వకాలంలో విడాకుల మాట చాలా తక్కువగా వినేవాళ్లమని, ప్రస్తుతం భార్యాభర్తలు విడాకులు తీసుకోవడం సర్వసాధారణం అయిపోయిందని అన్నారు. ఇది చాలా బాధాకరమైన విషయం అని, మధ్యవర్తిత్వం ద్వారా భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇప్పించి తిరిగి వారు వైవాహిక జీవితాన్ని కొనసాగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి(అడ్మినిస్ట్రేషన్ జడ్జి)జస్టిస్ మౌషుమీ భట్టాచార్య వర్చువల్‌గా హాజరయ్యారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, వరంగల్, హనుమకొండ చైర్మన్లు బీవీ నిర్మలా గీతాంబ, సీహెచ్ రమేశ్‌బాబు, కార్యదర్శులు సాయికుమార్, క్షమాదేశ్ పాండే, కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, జడ్జిలు, రెండు జిల్లాల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్లు తీగల జీవన్ గౌడ్, రమేశ్‌బాబు, బార్ కౌన్సిల్ మెంబర్లు బైరపాక జయకర్, సిరికొండ సంజీవ రావు, ఉమ్మడి జిల్లాల న్యాయవాదులు, డీడబ్ల్యూవో, డీఆర్డీఏ, మెప్మా, సఖీ, భరోసా, బీసీ వెల్ఫేర్, మైనారిటీ, డీఎంహెచ్‌వో, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

## సూపర్ స్పెషాలిటీకి నీళ్లు కరువు

- పెద్దాసుపత్రికి మున్సిపల్ వాటరే దిక్కు
- కనీసం బోరు కూడా లేని దుస్థితి

వరంగల్ చౌరస్తా, నవంబర్ 9 : పేరుకే 250 పడకల పెద్దాసుపత్రి అన్నట్లుగా ఉంది కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పరిస్థితి. శనివారం ఉదయం నుంచి హాస్పిటల్ అవసరాలకు చుక్క నీళ్లు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటుగా ల్యాబ్‌ల్లో సేవలు సైతం నిలిచిపోయాయి. ఆరు అంతస్తుల్లో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు మున్సిపల్ వాటరే దిక్కు. పెద్దాసుపత్రి అవసరాలకు తగినట్లు కనీసం బోరు కూడా లేదు. నిత్యం వందల మంది ఓపీ పేషెంట్లు, పదుల సంఖ్యలో అత్యవసర సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు పొందే ఇన్‌పేషెంట్లకు చికిత్స అందిస్తున్న హాస్పిటల్‌కు కనీస నీటి వసతులు సమకూర్చుకోవడంలో వైద్యాధికారులు విఫలమయ్యారు. నీరు లేకపోవడంతో కిడ్నీల సమస్య మూలంగా డయాలసిస్ చేయించుకునే పేషెంట్లు గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. నగరంలోని ప్రధాన కూడలిలో నీటి పైప్ లైన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో మున్సిపల్ వాటర్‌పై ఆధారపడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చుక్క నీరు లేకుండాపోయింది. వైద్యాధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. నీటి కొరత కారణంగా వైద్యసేవలు నిలిచిపోయిన విషయం బయట పడడంతో రాత్రి సుమారు 7గంటల ప్రాంతంలో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీటి సరఫరా కల్పించారు. నిత్యం వేల లీటర్ల వినియోగం ఉండే హాస్పిటల్‌కు శాశ్వత నీటి వసతిని ఏర్పాటు చేయకపోవడంపై రోగులు, అటెండెంట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సెల్‌ఫోన్ ఫ్లాష్ లైట్ల వెలుతురులో ప్రసంగిస్తున్న హైకోర్టు జడ్జి పంచాక్షరి

## కరెంట్ కట్‌తో అంతరాయం

హనుమకొండ : కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు షరా మామూలే అయ్యాయి. శనివారం హనుమకొండలో నిర్వహించిన 'న్యాయసేవా దినోత్సవ' కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి ప్రసంగిస్తున్న క్రమంలో కరెంట్ పోవడంతో సెల్‌ఫోన్ల ఫ్లాష్ లైట్ల వెలుతురులోనే మాట్లాడారు. సుమారు 20 నిమిషాల పాటు కరెంటు పోగా, వెంటనే తేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరించారు. హైకోర్టు జస్టిస్‌లు పాల్గొన్న కార్యక్రమంలో కరెంటు పోవడం ఏంటని పలువురు చర్చించుకోవడం వినిపించింది.